కనెక్షన్ల కోసం నిరీక్షణ

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డీడీ కట్టి నెలలుగా వేచి చూస్తున్న రైతులు
- పంటల సాగుకు తప్పని తిప్పలు



పొట్టపెల్లి సమీపంలో ఓ రైతు నూతనంగా వేసుకున్న బోరు

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో చెరువులు, కాలువల ద్వారా సాగునీరు అందని అన్నదాతలు బోరుబావుల ద్వారా పంటలు పండించుకుంటున్నారు. దీంతో కొందరు రైతులు నూతనంగా బోరు బావుల ద్వారా వ్యవసాయం చేయాలని నూతన విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.నెలలు గడుస్తున్నా.. విద్యుత్ అధికారులు తమ దరఖాస్తులను పరిష్కరించడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీడీలు చెల్లించినా..

నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం నిబంధనల ప్రకారం మీసేవా కేంద్రాలకు వెళ్లి మోటారు సామర్థ్యానికి అనుగుణంగా డీడీలు చెల్లించి.. సంబంధిత అధికారులకు అందిస్తున్నారు. డీడీలు అందుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎస్టీమేషన్ వేసి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలి. కానీ తమకు కనెక్షన్ మంజూరు చేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

పెండింగ్‌లో 40 దరఖాస్తులు..

మండలంలోని వివిధ గ్రామాల రైతులు నూతన వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో 40 పెండింగ్‌లో ఉన్నాయని ఏఈ మహేశ్ తెలిపారు. ఇందులో 10 దరఖాస్తుల పనులు చివరి దశకు చేరాయని.. వాటికి రెండు, మూడు రోజుల్లోనే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మిగతా 30 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు.

నూతన విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసే విధానం..

1. రైతులు ముందుగా సమీపంలోని మీ సేవా కేంద్రంలో నూతన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుని మోటార్ కెపాసిటికి అనుగుణంగా డీడీ రూపంలో డబ్బులు చెల్లించాలి.
2. డీడీ చెల్లించిన అనంతరం తీసుకున్న దరఖాస్తుపై రైతు సంతకం చేసి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లను జతపరచాలి.
3. తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యుత్ కనెక్షన్ కోసం సీ ఫామ్ సర్టిఫికెట్ తీసుకోవాలి.
4. దరఖాస్తు చేసుకునే రైతు గృహ అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్ మీటర్ రసీదు, రెండు పాస్ ఫొటోలను అందించాలి.
5. నూతన విద్యుత్ మోటార్‌కు కెపాసిటర్ కొని దానికి సంబంధించిన రసీదును జతపరచాలి.పైన సూచించిన విధంగా అన్ని పత్రాలను జత చేసి మండలకేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధి కారులకు అందించాలని ఏఈ మహేశ్ తెలిపారు.

ఐదేళ్లవుతున్నా సర్వీస్ నంబర్ ఇవ్వలేదు



నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ చెల్లించి అధికారులకు అందించి ఐదేళ్లవుతోంది. మోటార్‌కు కనెక్షన్ ఇచ్చినప్పటికీ ఎలాంటి సర్వీస్ నంబర్ కేటాయించలేదు.

– సుమన్, యువ రైతు, ధర్మారం

2013లో డీడీ చెల్లించా



2013లో విద్యుత్‌శాఖకు డీడీలు చెల్లించి అధికారులకు అందించాను. కనెక్షన్ ఇచ్చారు కాని ఇప్పటి వరకు సర్వీస్ నెంబర్ రాలేదు. త్వరగా ఇప్పించేలాగా చర్యలు చేపట్టాలి.

– లింగయ్య, రైతు, రాచాపూర్

త్వరలోనే పరిష్కరిస్తాం

మండలవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తాం. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఖాళీ ఉంటే వెంటనే కనెక్షన్ ఇస్తాం. విద్యుత్ స్తంభాలు అవసరం ఉంటే ఎస్టిమేషన్ వేసి కనెక్షన్ ఇచ్చేందుకు నెల రోజులు పడుతుంది.

– మహేశ్, ఏఈ, లక్ష్మణచాంద

క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వివరాలను బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటించి నమోదు చేశారన్నారు. గ్రామాల వారీగా సేకరించిన వివరాలను ప్రజావేదికలో వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల ఉపాధి కూలీలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే మనుమడి అక్షరాభ్యాసం



అక్షరభ్యాసం చేస్తున్న అర్చకులు

బాసర: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మనుమడు కియాన్ పటేల్‌కు అక్షరాభ్యాసం చేయించారు. ఎమ్మెల్యే కుమారుడు సందీప్ పటేల్‌కు కియాన్ కొడుకు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేశారు.

పంచాయతీ కార్మికుల నిరసన



ముథోల్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ముథోల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా అధ్యక్షుడు వాగ్మారే ఆకాశ్ మాట్లాడుతూ తమకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు శంకర్, శ్రీకాంత్, ఆకాశ్ రవి, సాయినాథ్, మహారతన్, కేర్బ, జల్బ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్ నుంచి ఏరియా ఆసుపత్రికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ర్యాంప్ దెబ్బతిని ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంప్ సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. వారి వెంట నాయకులు, సిబ్బంది ఉన్నారు.

రేపు మెగా వైద్యశిబిరం

ఖానాపూర్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఖానాపూర్‌కు చెందిన ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ అభిలాష అభినవ్ తదితరులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'

భైంసాటౌన్: గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించి బిల్లులను షరతులు లేకుండా విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని గాంధీగంజ్ వద్ద గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.10లక్షలలోపు బిల్లులు చెల్లిస్తామనడం సరికాదని.. పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజు, రాకేశ్, రాజేందర్, రవిగౌడ్, కిష్టయ్య తదితరులున్నారు.

పాదచారి నడిచేదెలా..?



రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఫుట్‌పాత్‌పై నిర్మాణం

జిల్లాకేంద్రంలో మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి పాదచారుల కోసం ఫుట్‌పాత్ నిర్మించారు. కానీ పలువురు వీధివ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఓ వైపు ట్రాఫిక్, మరోవైపు ఆక్రమణల కారణంగా పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల ఫుట్‌పాత్‌లు ధ్వంసం చేయడంతో రెయిలింగ్ కనిపించకుండా పోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఆఫీసర్స్ క్లబ్ కాంప్లెక్స్ ఎదుట..



బస్టాండ్ ముందు కానరాని ఫుట్‌పాత్



నటరాజ్‌నగర్ సమీపంలో టైల్స్ దుస్థితి..



ఓల్డ్ బస్టాండ్ మార్కెట్ వెళ్లే దారిలో..

నేడు శనిత్రయోదశి పూజలు

సోన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం శనిత్రయోదశి(అనురాధ నక్షత్రం) నేపథ్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పూజారి ఆచార్య రామకృష్ణ పంతులు తెలిపారు.



పూజలు చేస్తున్న భక్తులు

నేటి విలీన సభ జయప్రదం చేయండి



ఖానాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 28న నిర్వహించే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శి జె.రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే విలీనసభకు ప్రధాన వక్తగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరవుతారని.. కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నిర్మల్ డివిజన్ కార్యదర్శి హరిత, నాయకులు గంగాధర్, జైభీమ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలీనసభ పోస్టర్ ఆవిష్కరించారు. కుడుదుల రాజేశ్, గోనె స్వామి, లింగన్న, శ్రీనివాస్, గంగన్న, శేఖర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

'స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం'



కుంటాల : అందాకూర్‌లో ఎన్నికైన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు



నర్సాపూర్(జి): గొల్లమాడలో సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కుంటాల: స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేశెట్టి అశోక్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సాయి సూర్యవంశీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అందాకూర్, అంబుగామ గ్రామాల్లో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అంబుగామలో 54 వ బూత్ అధ్యక్షుడిగా జాదవ్ శివాజీ, అందాకూర్‌లో 65వ బూత్ అధ్యక్షుడిగా బాపన్‌పల్లి సాయినాథ్, కార్యదర్శిగా తోకల అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్, నారాయణ, ప్రశాంత్, సృజన్, నవీన్, గోవింద్, ప్రసాద్, దత్తు, అఖిల్, శ్రీకాంత్, యోగేశ్, అశోక్, దత్తు, కిరణ్, సదాశివ్, ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లమాడలో..

నర్సాపూర్ (జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 74వ బూత్ అధ్యక్షుడిగా నాకిడి లక్ష్మణ్, 75వ బూత్ అధ్యక్షుడిగా పేట గంగాధర్, 76వ బూత్ అధ్యక్షుడిగా దేవన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సీనియర్ నాయకులు సూచించారు. బీజేపీ నాయకులు మెడిసెమ్మె రాజు, మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, గుండాల భోజన్న, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, మిట్టపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు మరమ్మతులు చేయరూ



భైంసారూరల్: మండలంలోని పాంగ్రిలో ముురుగు కాలువ పక్కన సీసీ రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రజలు తరచుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికే పలువురు అదుపుతప్పి కిందపడినట్లు కాలనీవాసులు తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, ఫోన్: 83090 52136

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



కడెంలో నివాళులర్పిస్తున్న సతీశ్‌రెడ్డి, నేతలు



భైంసాలో నివాళులర్పిస్తున్న నారాయణ్‌రావు



బాసర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కడెం: దేశంలో ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్ అధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, భూషణ్, రఫీక్, బబ్లూ, లచ్చన్న, ఇందూర్, రమేశ్, శేఖర్ తదితరులున్నారు.

భైంసాటౌన్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాసర: సమాచారహక్కు చట్టం, ఆధార్, ఉపాధిహామీపథకం వంటి చట్టాలను రూపొందించి అమలు పరిచిన ఘనత ప్రధాని మన్మోహన్ సింగ్ కే దక్కుతుందని బాసర మాజీ సర్పంచ్ మమ్మాయి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పించి సంతాపం తెలిపారు. సంజీవరావు దేశముఖ్, రాజు దేశాయ్, రాందాస్, బలగం దేవేందర్, సంతోష్ ఇక్రం, మూస, బాలు, ఫారూఖ్, సాదిక్, హన్మంత్ గౌడ్, పోశెట్టి, సాయిలు, ఫకీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఒంటికాలిపై కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు ఏడోరోజుకు చేరాయి. శుక్రవారం నిరవధిక రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు ఒంటికాలిపై నిలబడి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, విజయ, పద్మ, భాను, నర్సవ్వ, మంజుల, మంగ తదితరులున్నారు.

ఆవుకు వినతిపత్రం అందజేత

కడెం: మండలకేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన కొనసాగుతోంది. శుక్రవారం కార్మికులు ఆవుకు వినతిపత్రం ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాధ మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల రూ.పది వేల వేతనం ఇచ్చి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఇందులో కార్మికులు సునీత, వెంకవ్వ, రజిత, గంగామణి తదితరులున్నారు.

ఘనంగా పడిపూజ

ముథోల్: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ గల్లీలో శుక్రవారం గురుస్వామి పోతన్నయాదవ్ ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ప్రణీత్ మహరాజ్ మంత్రోచ్ఛరణల నడుమ అయ్యప్పస్వామి ప్రతిమకు, పాలు, నెయ్యితో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములు అనిల్, గంగాధర్, రోళ్ల బాలాజీ, దుర్గప్రసాద్, దత్తు తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

సోన్: మండలంలోని కడ్తాల్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి పోతన్న

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోర్తాటి వంశీ తండ్రి అనారోగ్యానికి గురవగా.. శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండలంలోని గోడలపంపు గ్రామంలో బట్టు రాజేందర్ తండ్రి చిన్నలింగన్న, మామిడి లింగరాజు తండ్రి మామిడి నర్సరాజు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం గోసంపల్లెలో మృతి చెందిన డా.గంగాధర్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో దయానంద్, వెంకాగౌడ్, తిరుపతిగౌడ్, లక్ష్మీపతిగౌడ్, ఆరె గంగాధర్, జంగిలి శంకర్, కరిపె రాజ్‌కుమార్, అమంద శ్రీనివాస్, సంతోష్, వీరేశ్, చరణ్, ధర్మరాజు, స్వామి తదితరులు ఉన్నారు.

యాచకులకు అల్పాహారం

బాసర: మండలకేంద్రంలో శుక్రవారం బాసర శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాశ్ యాదవ్.. తన తాత పెద్దసాయన్న జ్ఞాపకార్థం 70 మంది యాచకులకు అల్పాహారం అందించారు. జ్ఞాన సరస్వతి ఆలయం, రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఆహారం అందించినట్లు వారు పేర్కొన్నారు.

సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి

భైంసాటౌన్: సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ముథోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. ఇటీవల బంగారు, వెండి వర్తక సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు, సంఘ పెద్దలు నారాయణ, రాములు, సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నర్సాపూర్(జి): మండలకేంద్రానికి చెందిన ముష్కం వెంకటేశ్‌గౌడ్ అనే లబ్ధిదారుడికి రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం బీజేపీ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బర్కుంట నరేందర్, దత్తురాం, నవీన్, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.